క్లుప్తంగా

నేడు మేకా ప్రతాప్ ప్రచారం

నూజివీడు: ముక్కొల్లుపాడు, తూర్పు దిగవల్లిలో వైఎస్సార్ సీపీ నూజివీడు అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి నిర్వహించే ప్రచారంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశాయి.

అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



నూజివీడు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎమ్మెల్యే మేకా ప్రతాప్ తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) ప్రజలను కోరారు. నూజివీడు మూడో వార్డులో గురువారం ఆయన ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని చెప్పారు. టీడీపీకి ఓటేస్తే అవినీతి, అక్రమాలకు అవకాశం ఇచ్చినట్లేనని, సంక్షేమ పథకాలేవీ అమలవ్వవని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు సక్రమంగా జరిగేలా చర్యలు

మైలవరం: 2024 ఎన్నికలు సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మూడు నియోజకవర్గాల పరిశీలకులు నరీందర్ సింగ్ బాలి తెలిపారు. ఎన్నికల పరిశీలకులు నరీందర్ సింగ్ బాలి మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను గురువారం పరిశీలించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. సంపత్‌కుమార్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నరీందర్ సింగ్ బాలి జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా కేంద్రం నుంచి వచ్చారు. నామినేషన్ల స్క్రూటినీలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో వార్షిక తిరునాళ్ల మహోత్సవం మూడో రోజు గురువారం కొనసాగింది. గురువారం జలబిందెలు, పూలకప్పెర, ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. బుధవారం రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. జానపద డప్పులు, కనకతప్పెట్లు, శక్తివేషాలు, విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో అమ్మ వారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో అన్నదానానికి ద్వారకా తిరుమలకు చెందిన భక్తుడు పెండేటి కిషోర్, లక్ష్మీ దంపతులు రూ. 1.01 లక్షలను ఆలయ అర్చకులకు గురువారం విరాళంగా అందజేశారు. దాత దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆశీర్వదించి స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

సర్నాల కుమారుడు ప్రచారం

రెడ్డిగూడెం: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కుమారుడు సర్నాల మణికంఠ అన్నారు. తిరుపతిరావు విజయాన్ని కాంక్షిస్తూ మణికంఠ కుదప గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎంతోమంది సామాన్యులను సైతం అసెంబ్లీకి పంపేందుకు అవకాశం కల్పించారని, ప్రజలు సామాన్యుడిని అసెంబ్లీకి పంపించేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రామారావు, వైస్ ఎంపీపీ–2 పాటిబండ్ల శ్రీనివాసరావు, సర్పంచ్ బలగాని రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సమాధులు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని సర్వే నెంబర్ 459/4లోని ముస్లిం సమాధుల్లో తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి మహ్మద్ నూర్ కోరారు. ఈ మేరకు ఎన్టీటీపీఎస్ ఎస్ఈ (సివిల్) సురేష్‌బాబుకు గురువారం వినతిపత్రం అందజేశారు. నూర్ మాట్లాడుతూ సుమారు 4.70 ఎకరాల్లో ఉన్న ముస్లిం సమాధులు జేసీబీతో తొలగించడం ముస్లిం మనోభావాలను కించపర్చడమేనన్నారు. తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అల్తాఫ్ రజా, న్యాయవాది మసూద్ ఆలీజిన్నా తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం అపవిత్ర పొత్తులు

- గెలుపు కోసం సాధ్యంకాని హామీలిస్తున్న టీడీపీ
- 99 శాతం హామీలు అమలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు
- గ్రామాలలో ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



లింగాల గ్రామంలో ప్రచారం చేస్తున్న నల్లగట్ల స్వామిదాసు



ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్న కార్యకర్తలు

గంపలగూడెం: అధికారదాహంతో అపవిత్ర పొత్తులతో సాధ్యంకాని హామీలను ప్రకటిస్తూ ఎన్నికల సందర్భంగా మీముందుకు ఓట్ల కోసం వస్తున్న ప్రతిపక్ష పార్టీలను నమ్మవద్దని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండలం లింగాల, సొబ్బాల, అర్లపాడు, గాదెవారిగూడెం, చింతలనర్వ, చెన్నవరం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు స్వామిదాసుకు ఘన స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలను చేబూని, టోపీలను ధరించి జై జగన్ అంటూ ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ 2014లో ఇచ్చిన హామీలను నెరవేర్చని చంద్రబాబు మళ్లీ కొత్త హామీలతో మిమ్మల్ని మోసం చేసేందుకు వస్తున్నాడని విమర్శించారు. డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానని చెప్పిన చంద్రబాబు కేవలం పసుపు కుంకుమ పేరిట మహిళలను, రుణమాఫీ చేయకుండా రైతులను మోసగించాడని విమర్శించారు. చెప్పిన మాట, ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చే మనస్తత్వం ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకులను ప్రజలు నమ్మాలన్నారు. 2019లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధికి కొనసాగిస్తున్న అభివృద్ధి పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. గడచిన 30 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఉంటున్న తనకు ఇక్కడి సమస్యలు పూర్తిగా తెలుసునని, ప్రజా సేవ కోసమే తాను పార్టీ మారాల్సి వచ్చిందని చెప్పారు. జరుగనున్న ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ని గెలించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు గుత్తికొండ భాస్కర్‌రెడ్డి, కాసర వెంకటరెడ్డి, అంకిరెడ్డి అంజనారెడ్డి, చల్లా జగన్నాథరావు, నున్నా వెంకటేశ్వరరావు, చింతల శ్రీనివాసరావు, దారెల్లి ఏసుపాదం, దుంపా వెంకటరెడ్డి, కూరాకుల రామకృష్ణ, వి. నరసింహారావు, తుటారి శ్రీనివాసరావు, యనమద్ది కృష్ణయ్య, యనమద్ది నాగమల్లేశ్వరరావు, జొన్నలగడ్డ ప్రేమరాజు, జెడ్పీటీసీ కోట శామ్యూల్, మండల పార్టీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



నూజివీడు: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అభ్యర్థులకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్ఏ రామన్ ఆదేశించారు. గురువారం ఆయన నూజివీడులో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. సీ విజిల్ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలను తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ర్యాలీలు, బహిరంగ సభలకు సంబంధించిన ఖర్చులను సంబంధిత అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేయాలన్నారు. సీ విజిల్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి వై.భవానీశంకరి, మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట రామిరెడ్డి, తహసీల్దార్ ఏవీ శాస్త్రి పాల్గొన్నారు.

వనరుల దోపిడీకే వారిద్దరూ ఒక్కటయ్యారు

- వైఎస్సార్ సీపీ మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు
- కొండపల్లి ప్రచారంలో ఉమా, వసంతపై ఫైర్



కొండపల్లిలో ప్రచారం చేస్తున్న తిరుపతిరావు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మైలవరం నియోజకవర్గంలో సహజ వనరుల దోపిడీకి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ ఒక్కటయ్యారని మైలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విమర్శించారు. ఇప్పటి వరకు విడివిడిగా దోచుకున్న ఇద్దరూ చంద్రబాబు ఆదేశాలతో మరలా కలిసి దోచుకునేందుకు ఏకమయ్యారని, వారిని ప్రజలు గమనించాలని కోరారు. కొండపల్లిలోని పలు వార్డుల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు ఆగర్భ శత్రువులుగా నటించిన ఉమా, వసంత ఇసుక, గ్రావెల్, బూడిద దోపిడీలో ఆరితేరారని ఆరోపించారు. వనరుల దోపిడీని దృష్టిలో పెట్టుకునే నందిగామ నుంచి ఒకరి తర్వాత ఒకరు వలస వచ్చారని చెప్పారు. ఇటువంటి దోపిడీదారులను ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. నేను గెలిస్తే అభివృద్ధిపై దృష్టి పెడతానని, సహజ వనరుల జోలికి పోనని స్పష్టం చేశారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ప్రజలు హారతి పట్టి ఆప్యాయంగా ఆహ్వానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

ముస్లిం రిజర్వేషన్లపై సమాధానం చెప్పాలి

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీ నేతల మాటలకు నియోజకవర్గ కూటమి టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ ముస్లింలకు సమాధానం చెప్పి ఓట్లు అడగాలని సర్నాల తిరుపతిరావు డిమాండ్ చేశారు. దివంగత మహనేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లు ముస్లింలకు తెచ్చారని గుర్తుచేశారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెబుతున్న పార్టీతో అంటకాగుతున్న వారిని గమనించాలని విజ్ఞప్తి చేశారు. ముస్లింలు తమ ఆత్మాభిమానంగా భావించే రిజర్వేషన్లను పరిరక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)కి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్ సంఘీభావం

ఎన్నికల ప్రచారంలో ఉన్న తిరుపతిరావును మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు కలిశారు. ఎన్నికల ప్రచారం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జగనన్న నాయకత్వాన్ని బలపరిచి ఎంపీ అభ్యర్థిగా కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరుపతిరావును గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇటీవలి కాలంలో తన కాలుకు ఆపరేషన్ చేయించుకున్న జ్యేష్ఠ వైఎస్సార్ సీపీ విజయానికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. వార్డు కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, మామిళ్లపల్లి చైతన్య, స్రవంతి, నాగరాజకుమారి, దయా, చంద్రం, నాయకులు మిక్కిలి శరభయ్య, పోరంకి పద్మావతి, ఎంఏ బేగ్, ఎం.ఆనంద్, పోరంకి శ్రీనివాసరాజు, కె.నాగరాజు, నల్లమోతు సుభాష్, కుమ్మరి శ్రీనివాస్, బాలచందర్, రాజేశ్వరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల స్వీకరణ ఘట్టం

తిరువూరు: ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఘట్టం గురువారంతో ముగిసింది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల దాఖలు పర్వంలో తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 24 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్, బహుజన సమాజ్ పార్టీలతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన తిరువూరులో ఈసారి స్థానికులే ఎక్కువగా పోటీలో ఉన్నారు. తెలుగుదేశం అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు, లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థి శీలం రాజా, ఇండిపెండెంట్ అభ్యర్థి లాము ప్రసన్నకుమార్‌లు మాత్రమే స్థానికేతరులు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు మినహా మిగిలిన అభ్యర్థులందరూ మొదటిసారి ఎన్నికల్లో పోటీచేసేవారు కావడం గమనార్హం.

● మైలవరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ పర్వం గురువారంతో ముగిసింది. మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. మైలవరం నియోజకవర్గంలో 25 మంది అభ్యర్థుల నుంచి మొత్తం 39 నామినేషన్ పత్రాలు స్వీకరించామని ఎన్నికల అధికారి సంపత్‌కుమార్ తెలిపారు.

నూజివీడులో..

నూజివీడు: ఈనెల 18న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ పర్వం గురువారంతో ముగిసింది. నూజివీడు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు గురువారం 9 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన ఈనెల 26న ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు కొనసాగుతుంది. పరిశీలనకు అభ్యర్థితోపాటు ముగ్గురిని మాత్రమే అనుమతిస్తారు. 29న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను వెలువరిస్తారు. హోం ఓటింగ్‌కు 109 దరఖాస్తులు అందాయి. వీటిలో 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు 77 మంది, దివ్యాంగులు 32 మంది ఉన్నారు. హోం ఓటింగ్‌ను మే 2వ తేదీ నుంచి ప్రారంభిస్తామని, పీఓ, ఏపీఓ, సెక్టార్ ఆఫీసర్, పోలీస్ సిబ్బంది ఆయా వ్యక్తుల ఇళ్లకు వెళ్లి హోం ఓటింగ్ నిర్వహిస్తారని ఆర్వో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై.భవానీశంకరి తెలిపారు. అభ్యర్థుల వ్యయం రూ.40 లక్షలు మించితే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నోటిఫికేషన్ జారీ నాటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గ పరిధిలో రూ.11 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని, జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలించి ఎవరి నగదును వారికి అందజేస్తామని చెప్పారు. రాజకీయ నాయకుల నగదు పట్టుబడలేదన్నారు.

చివరి రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు



మైలవరంలో నామినేషన్ వేస్తున్న సర్నాల నాగలక్ష్మి

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్ల గడువు ముగిసే సమయంలో అధిక సంఖ్యలో అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, తెలుగుదేశం, భారత చైతన్య పార్టీ అభ్యర్థులు నల్లగట్ల స్వామిదాసు, లాం తాంతియా కుమారి, కొలికపూడి శ్రీనివాసరావు, చిలపరపు వెంకటేశ్వరరావులు రెండో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కొలికపోగు శ్రీను, లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థిగా శీలం రాజా, స్వతంత్ర అభ్యర్థులుగా బీమాల అనూష, వాసం మెహర్‌బాబా నామినేషన్లు వేశారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ డమ్మీ అభ్యర్థులుగా నల్లగట్ల సుధారాణి, కోట పుల్లమ్మ కూడా నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవికి అందజేశారు. చివరి రోజు 11 నామినేషన్లు దాఖలయ్యాయి.

● నూజివీడు: చివరి రోజు గురువారం 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ నుంచి కొలుసు పార్థసారథి, డమ్మీ అభ్యర్థిగా ఆయన కుమారుడు కొలుసు నితిన్‌కృష్ణ, స్వతంత్ర అభ్యర్థిగా కొలుసు పార్థసారథి భార్య కొలుసు కమల లక్ష్మి నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ నుంచి మరీదు కృష్ణ, స్వతంత్ర అభ్యర్థులుగా మండలపు శ్రీనివాసరావు, దురిశేటి అశోక్‌కుమార్, పిన్నిబోయిన ప్రభుకుమార్, ఆముదాల ఇస్సాక్, జాతీయ జనసేన పార్టీ నుంచి వెంకట శివ పూర్ణచంద్రరావు నామినేషన్లు వేశారు.

● మైలవరం: మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం 13 నామినేషన్లు స్వీకరించినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. సంపత్‌కుమార్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా ప్రశాంతి వల్లూరు, గుదే శ్రీనివాసరావు, నంబూరు పుల్లారావు, వల్లభనేని నాగ పవన్‌కుమార్, మోచర్ల వెంకట రమణ, కొలికపోగు వెంకటరావు, బీఎస్పీ తరఫున గాలంకి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు తరఫున ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ డమ్మీ అభ్యర్థిగా సర్నాల నాగలక్ష్మి, జాతీయ జన సేన పార్టీ అభ్యర్థిగా పోల్కంపల్లి అనిల్‌కుమార్, టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ తరఫున ఆయన కుటుంబ సభ్యులు, జనవాహిని పార్టీ అభ్యర్థిగా ధరావతు శివశంకర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా యార్లగడ్డ శేఖరరావు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

మలేరియా నివారణపై అవగాహన



దిగవల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు



తిరువూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సిబ్బంది

నూజివీడు: పరిసరాల పరిశుభ్రత, మురుగనీరు నిల్వ లేకుండా చేయడం వల్ల దోమల బెడద ఉండదని తద్వారా మలేరియాను అదుపులో ఉంచవచ్చని దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని దిగవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా ఆడ అనాఫిలిస్ దోమలు కుట్టడం వల్ల వస్తుందని, దోమల వ్యాప్తిని అరికట్టేలా ప్రజలు చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను ఉపయోగించాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి పి.అనూష మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టి మలేరియాను నిరోధించవచ్చని చెప్పారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి: మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆగిరిపల్లిలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చేయడం వల్ల దోమలు ప్రబలకుండా ఉంటాయని జగన్‌మోహన్‌రావు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ యూనిట్ ఆఫీసర్ యలమంద, ఎంపీహెచ్ ఈఓ రత్నబాబు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: మలేరియా వ్యాధిని అంతమొందించాలంటే దోమల నిర్మూలనకు కృషి చేయాలని వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, అవినాష్, కరీముల్లా పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా గురువారం ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ పరిశుభ్రతపాటిస్తూ, మొక్కలను పెంచి, మంచి గాలి, మంచి ఆహారంతో ఆనందంగా జీవించాలని సూచించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వైద్యశాఖ, సచివాలయాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమకాటుతో మలేరియా వ్యాప్తి

తిరువూరు: పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలకు ఆవాసంగా మారి వ్యాధులను వ్యాపింపజేస్తాయని, దోమకాటుతోనే మలేరియా వస్తుందని తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలనా దినోత్సవం సందర్భంగా గురువారం తిరువూరులో వైద్యసిబ్బంది అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, రోజుల తరబడి జ్వరం వస్తుంటే రక్తపరీక్ష చేయించుకోవాలని రేష్మాబేగం చెప్పారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, యాంటీ లార్వా లిక్విడ్ పిచికారీ, ఐఆర్ఎస్ వంటి చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



ఇబ్రహీంపట్నం ఎస్ఆర్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం



గోదా జస్వంత్



గుల్నార్

ఇబ్రహీంపట్నం: జేఈఈ మెయిన్స్ రెండో విడత ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఎస్ఆర్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారని జోనల్ ఇన్‌చార్జి కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ గుంటుపల్లి కాలేజీ విద్యార్థి సాత్విక్ రెడ్డి జాతీయ స్థాయిలో 42వ ర్యాంక్, సాయి రోహిత్ 4,006 ర్యాంక్, ఎస్ఆర్ సిద్ధార్థ నగర్ కాలేజీ విద్యార్థి గురు వెంకటకృష్ణ 4,852 ర్యాంక్, ఎస్ఆర్ గొల్లపూడి కాలేజ్ నవనీత్ 1,330 ర్యాంక్ సాధించారని చెప్పారు. విజయవాడలోని అన్ని బ్రాంచ్‌లలో 73 మంది విద్యార్థులు నిట్‌లో సీట్లు సాధించడం గర్వకారణమని ఎస్ఆర్ కళాశాల జీఎం రాజేంద్ర ప్రసాద్, డీజీఎం జేవీ రమణ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

తిరువూరు విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: ఐఐటీ–జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో తిరువూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపారు. జనరల్–ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో గోదా జస్వంత్ 773 ర్యాంకు సాధించగా, అదే కేటగిరీలో షేక్ గుల్నార్ 2,818 ర్యాంకు సాధించింది. ఇరువురు విద్యార్థులు నిరుపేద కుటుంబానికి చెందినవారు కాగా, తిరువూరులో పదో తరగతి వరకు, ఇంటర్మీడియెట్ విజయవాడ నారాయణ కాలేజీలో అభ్యసించారు. విద్యార్థుల్ని పలువురు అభినందించారు.

ప్రతాప్‌కు మద్దతుగా ప్రచారం

ఆగిరిపల్లి: కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎంపీటీసీ సభ్యురాలు దొండపాటి కుమారి అన్నారు. గురువారం ఈదరలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నాయకులు దన్నపనేని సత్యంబాబు, కోటగిరి గోపాలకృష్ణ, రామిశెట్టి సత్యనారాయణ, దొండపాటి స్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ స్క్రీన్‌పై ప్రచారం

ముసునూరు: వైఎస్సార్ సీపీ మళ్లీ ఘన విజయం కోరుతూ సంచార డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. బుధవారం రాత్రి, గురువారం మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌లను అత్యధిక మెజారిటీలతో గెలిపించాలని విస్తృత ప్రచారం చేశారు. ప్రతి కూడలిలో ప్రజలు ఆసక్తిగా ప్రచారాన్ని తిలకించారు. పేదలను ఆదుకునే జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలని ప్రచారం చేశారు.